క్లుప్తంగా

హాస్టల్స్ ఏర్పాటుతో ఇబ్బందులపై అవగాహన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని వెస్టర్న్ హిల్స్ సొసైటీ అడ్డగుట్టకాలనీలో హాస్టల్ బిల్డింగ్ ఓనర్స్, బిల్డింగ్ లీజుదారుల సమస్యలు, హాస్టల్స్ ఏర్పాటుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్, ట్రాఫిక్ సీఐ నరసింహారావు, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, డాక్టర్ మమత, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్‌లతో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నిత్యం ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. అలాగే మురుగు రోడ్డుపై పారుతోందన్నారు. ఈ సమస్యలపై అన్ని డిపార్టుమెంట్‌ల వారితో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సమస్యను సామరస్యంగా చర్చించి త్వరగా పనులను పూర్తి చేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ ధర్మారెడ్డి ఫేజ్–2లోని శ్రీరేణుకాఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎం.నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నం.4లోని కేకే రెడ్డి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానికులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. ఆస్తమా, పిల్లికూతలు, అలర్జీ, బ్రాంకైటీస్, న్యూమోనియా, టీబీ, హెచ్‌ఐవీ, లంగ్ కేన్సర్, గురక వంటి వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ప్రతి ఒక్కరూ కవిత్వం రాయొచ్చు'

ఉస్మానియా యూనివర్సిటీ: జీవితం నుంచే కవిత్వం పుడుతుందని ప్రముఖ కవి శివారెడ్డి అన్నారు. శుక్రవారం ఓయూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో కవితా సింగిడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివారెడ్డి మాట్లాడుతూ.. కవిత్వం రాయడానికి వ్యాకరణం, నిఘంటువులు అవసరం లేదని, ప్రతి ఒక్కరూ కవిత్వం రాయవచ్చన్నారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రొ.కమలాకర శర్మ, తెలుగు శాఖ హెడ్ ప్రొ.కాశీం, అంజయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.


20న అప్రెంటీస్, ఉద్యోగ మేళా

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా, ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు మేళా జరుగుతుందన్నారు. ఎస్సెస్సీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటు ఒక జత జిరాక్స్ కాపీలు తీసుకురావాలని చెప్పారు. వివరాల కోసం 9908849165, 9502248617 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

పరారీలో మరో వ్యక్తి

జీడిమెట్ల: గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని మాదాపూర్ ఎస్‌ఓటీ, జీడిమెట్ల పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన మోహన్, హైదరాబాద్ గాంధీనగర్‌కు చెందిన బి.యశ్వంత్‌లు ప్రైవేట్ ఉద్యోగులు. కాగా వీరిద్దరు సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారాన్ని ఎంచుకున్నారు. ఇద్దరు కలిసి గుంటూర్‌కు చెందిన శ్యాంకుమార్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి నగరంలో అవసరం ఉన్న వారికి ఎక్కువ రేటుకు విక్రయిస్తుంటారు. అదే విధంగా శుక్రవారం శ్యాంకుమార్ వద్ద 7కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. అనంతరం గంజాయిని షాపూర్‌నగర్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే జీడిమెట్ల పోలీసులతో కలిసి ఎస్‌వోటి పోలీసులు గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న మోహన్, యశ్వంత్‌లను షాపూర్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 7కిలోల గంజాయి, రెండు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కేసులు నమోదు చేశారు. ఏ3గా ఉన్న శ్యాంకుమార్ పరారీలో ఉన్నాడు. గంజాయి విలువ సుమారు రూ.2.4లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.


పోలీసుల అదుపులో నిందితులు


భరత్‌నగర్ కాలనీలోని బీఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్స్ వద్ద...


హెచ్‌పీ రోడ్డు వెనుక భాగంలో నాలా వద్ద...


మూసాపేట మెట్రో స్టేషన్ వద్ద రోడ్డుపైనే..

దుర్వాసన.. దుర్గంధం

రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారం


ప్రగతినగర్ వెనుక భాగంలో వసుంధర ఆసుపత్రికి వెళ్లే దారిలో పడవేసిన చెత్తాచెదారం

మూసాపేట: మూసాపేట సర్కిల్ పరిధిలో కూడళ్ల వద్ద, రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోతోంది. స్వచ్ఛ భారత్ అంటూ ప్రచారం చేసినా... ఆటోల ద్వారా ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తున్నా... చెత్తాచెదారం రోడ్లపై అలాగే నిండిపోతోంది. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నా మళ్లీ పేరుకుపోతోందని రోడ్లు డస్ట్‌బిన్ కేంద్రాలుగా మారుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించటమే కాకుండా రోడ్ల వెంట చెత్తను వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- భరత్‌నగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ క్వార్టర్స్ వద్ద చెత్తాచెదారం పేరుకుపోతోంది. అధికారులకు విన్నవిస్తే కానీ అక్కడి చెత్తను తొలగించరు. క్వార్టర్స్‌లో ఎవరూ లేక పోవటంతో ఆ ప్రాంతం మొత్తం చెత్తా చెదారంతో నిండిపోయింది.
- గూడ్స్ షెడ్ రోడ్డు నుంచి భరత్‌నగర్ కాలనీకి వెళ్లే దారిలో రోడ్డు పక్కన చెత్తాచెదారం నిత్యం పేరుకుపోతోంది. అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో కూడా రోడ్డు పైనే చెత్త పడవేస్తున్నారు. పక్కనే భారీ వాహనాలను పార్కింగ్ చేయటంతో ఎవరికి కనిపించకుండా లారీల వెనుకాల చెత్తను పడవేస్తున్నారు.
- భరత్‌నగర్‌కాలనీ కూరగాయల ప్రాంతంలో కూడా కూరగాయల వ్యర్థాలు ఎప్పటికప్పుడు పేరుకుపోతున్నప్పటికి మున్సిపల్ సిబ్బంది తొలగగించటం లేదు. దీంతో అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. మెట్రో స్టేషన్‌కు, ఎంఎంటీఎస్‌కు, కాలనీలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ప్రతి రోజు చెత్తను తొలగించాల్సి ఉండగా అధికారులు మాత్రం స్పందించటం లేదు.
- ప్రగతినగర్‌లోని వసుంధర ఆసుపత్రి వెనుక భాగంలో నాలాకు ఆనుకొని రోడ్డుపై చెత్తాచెదారం పడవేస్తున్నారు. ఈ ప్రాంతంలో కొద్ది దూరంలోనే రెండు మూడు ప్రాంతాల్లో చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారాయి. ఈ ప్రాంతంలో కూడా నిత్యం చెత్త పేరుకుపోతోంది.అంతే కాకుండా ఓపెన్ నాలాలో కూడా చెత్తా చెదారం పడవేస్తుండటంతో పేరుకుపోతోంది.
- భవానీనగర్ వెనుక భాగంలో, హెచ్‌పీ రోడ్డులో చెత్తాచెదారాన్ని నాలాలోనే పడవేస్తున్నారు. దీంతో నాలా ప్రవాహానికి అంతరాయం కలుగుతోంది. నాలా పక్కన వేసిన చెత్త కొన్ని రోజులకు నాలాలో పడిపోతోంది. ఇక్కడ సిబ్బంది మాత్రం చెత్తను తరలించటం లేదు.

నిధుల కొరత ఉంటే మంజూరు చేయిస్తా

మాధవరం ఎమ్మెల్యే కృష్ణారావు


బాలాజీనగర్ డివిజన్‌లోని పార్కులను సందర్శిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌లోని పార్కులను శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రత్యేకంగా మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. పార్కుల్లో ప్రతి రోజు వాకింగ్ చేయాలని కోరారు. క్రీడలకు సంబంధించి ఇండోర్ స్టేడియాలు, షటిల్ కోర్టులు, ఓపెన్ జిమ్‌లు రూపొందిస్తున్నామని తెలిపారు. ఎంతో సుందరంగా రూపుదిద్దుకుంటున్న పార్కుల విషయంలో ఇంకా నిధులు కొరత ఉంటే వెంటనే తనను సంప్రదించాలని అధికారులకు సూచించారు. అనంతరం పార్కుల్లో కొన్ని మార్పులు, సలహాలు, సూచనలు డీఈ ఆనంద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేర్ డిసీజెస్‌పై విస్తృత అవగాహన కల్పించాలి



సనత్‌నగర్: జన్యుపరమైన సమస్యలతో వచ్చే అరుదైన వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప పేర్కొన్నారు. రేర్ డిసీజెస్ డే సందర్భంగా శుక్రవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్ అండ్ హాస్పిటల్స్ ఫర్ జెనిటిక్ డిసీజెస్, క్యూర్ ఎస్‌ఎంఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సుకు బీరప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధులపై చాలామందికి అవగాహన లేకపోవడంతో ప్రారంభ దశలో వాటిని గుర్తించలేకపోతున్నారన్నారు. దీంతో వారికి సరైన వైద్యం అందించలేకపోతున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులకు సైతం రేర్ డిసీజెస్ పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ అశ్వీందలాల్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏడు వేలకు పైగా రేర్ డిసీజెస్ ఉన్నాయని, వాటిలో 80 శాతానికి పైగా జన్యుపరమైన సమస్యలతో వచ్చేవేనని చెప్పారు. 20 శాతం వ్యాధులకు మాత్రమే ప్రస్తుతం వైద్యం అందించగలుగుతున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ కలిగిన వారి కుటుంబాలకు ఈ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యాధులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వాలు ఫార్మా కంపెనీలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

ఫ్రాడ్ అనలిటిక్స్‌పై 31న గీతంలో వర్క్‌షాప్

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అకౌంటింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 31న 'ఫ్రాడ్ అనలిటిక్స్ అండ్ ఫోరెన్సిక్ అకౌంటింగ్' పై ఒకరోజు ఆన్‌లైన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు అకౌంటింగ్ విభాగాధిపతి డాక్టర్ గుత్తి ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఐఎస్‌ఓటీసీ)తో కలిసి దీనిని నిర్వహిస్తున్నామన్నారు. సంస్థల్లో జరిగే మోసాలు, వాటికి గల కారణాలు, పర్యవసానాలను అర్థం చేసుకోవడం, ఫోరెన్సిక్ అకౌంటింగ్ పద్ధతులు, మోసం జరిగినప్పుడు ఫోరెన్సిక్ అకౌంటింగ్‌ను ఎలా వినియోగించాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. అమెరికాలోని డెలాయిట్ ఫోరెన్సిక్ మేనేజర్ ఆశిష్ అగర్వాల్, భారత చార్టర్డ్ అకౌంట్స్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన సతీష్ అడ్డా, ఢిల్లీ క్రైస్ట్ విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ అభిషేక్ మహేశ్వరి, సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్–డేటా అనలిస్ట్ జ్యోతి రంజన్ నాయక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు డాక్టర్ బి.రమేష్–98496 25937, డాక్టర్ చంద్రభానుదాస్ 99380 78219లను సంప్రదించాలన్నారు.

దేశంలో మహిళకు గౌరవప్రదమైన స్థానం ఉంది


ముఖ్య అతిథిని సన్మానిస్తున్న హోలిస్టిక్ ఆస్పత్రి చైర్మన్ రామచంద్ర

భాగ్యనగర్‌కాలనీ: గుడి, బడి, ఇల్లు ఈ మూడు వ్యవస్థలూ సంస్కారాన్ని, సౌజన్యాన్ని, సచ్ఛీలతను మనుషుల్లో పెంపొందిస్తాయని... ప్రస్తుతం ఆ విధానం అమలులో లేకపోవటంతో ఈ సమాజం ఇంత అస్తవ్యస్తంగా, రాక్షసంగా ఉంటోందని, స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు ఎక్కువగా ఉంటున్నాయని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం నిజాంపేట రోడ్డులోని శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రిలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ఆస్పత్రి చైర్మన్ డా. వీఎస్ రామచంద్ర మాట్లాడుతూ.. మన భారతీయ సంస్కృతిలో స్త్రీకి ఎంతో గౌరవప్రదమైన స్థానం ఉందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, చిత్రవాణి డిప్యూటీ డైరెక్టర్ ఐనంపూడి శ్రీలక్ష్మి మాట్లాడుతూ... మన పిల్లలు వివక్ష, హింస, అత్యాచారాలు లేని సమాజంలో బతకాలంటే దానికి పునాది కుటుంబంలోనే పడాలన్నారు. సవాళ్లు, కష్టాలను తట్టుకొని జీవితంలో ఎదిగిన 5 మంది ధీర వనితలను ఈ సందర్భంగా సత్కరించారు. అదే విధంగా వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 108 ఫౌండర్ వెంకట్, కార్పొరేటర్ సత్యవతి, హాస్పటల్ ఫౌండర్ లక్ష్మీనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ డా. తుషార, డా. ఆలూరి విజయలక్ష్మి, డా. పాపినేని సుబ్బారావు, డా.అమృత, డా.నిఖిల, ప్రసన్నకుమారి, మాలిని, హేమలత, లక్ష్మి, సుధ పాల్గొన్నారు.

ఉత్తమ వర్క్ ప్లేస్‌గా సింక్రొనీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆర్థిక సేవల కంపెనీ సింక్రోనీకి ఉత్తమ పని ప్రదేశంగా గుర్తింపు లభించింది. మాదాపూర్‌లో కార్యాలయం కలిగి ఉన్న సంస్థ నగర ప్రతినిధులు ఈ విషయం తెలిపారు. 'ఇండియాస్ బెస్ట్ వర్క్‌ప్లేసెస్ బిల్డింగ్ ఏ కల్చర్ ఆఫ్ ఇన్నోవేషన్ బై ఆల్ 2023' పేరిట నిర్వహించిన ఎంపిక కార్యక్రమంలో టాప్ 50 కంపెనీలకు ర్యాంకింగ్‌లు అందించగా ఆవిష్కరణలపరంగా భారతదేశపు అత్యుత్తమ కార్యక్షేత్రంగా తాము నిలిచామన్నారు. సిబ్బంది నియామకంలో సమతుల్యత, సామాజిక బాధ్యతలకు అనుగుణంగా తమ కంపెనీలో ప్రస్తుతం 50% మహిళా ఉద్యోగులతో పాటుగా 105 మంది దివ్యాంగులు, 50కు పైగా సీనియర్స్, వారి కుటుంబ సభ్యులు ఉన్నారని వివరించారు.

21న 'మనూ'లో ప్రత్యేక ఉపన్యాసం

రాయదుర్గం: మనూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్షియన్, సెంట్రల్ ఏషియన్ స్టడీస్ (డీపీ అండ్ సీఏఎస్) సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఈనెల 21వ తేదీన నిర్వహించడం జరుగుతుందని డీపీ అండ్ సీఏఎస్ హెడ్ డాక్టర్ సయ్యద్ అస్మత్ జహాన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో కెనడాకు చెందిన ప్రముఖ పర్షియన్ స్కాలర్ డాక్టర్ సయ్యద్ తగీ ఆబిద్ ఉపన్యసిస్తారు.

యూజీ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

రాయదుర్గం: మనూలో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)–2023 ద్వారా వివిధ అండర్ గ్రాడ్యుయేట్ రెగ్యులర్ మోడ్ కోర్సులలో ఆన్‌లైన్ అడ్మిషన్లు అందిస్తోందని 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ తెలిపారు. దరఖాస్తుల సమర్పణ గడువును ఈనెల 30వ తేదీవరకు పొడిగించామన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 2023–24 నుంచి నాలుగు సంవత్సరాల యూజీ హానర్స్, రీసెర్చ్ ప్రోగ్రాంలు బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సులతో పాటు మల్టీ డిసిప్లినరీ మోడల్‌లో ప్రారంభిస్తోందన్నారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉంటుందన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


వేడుకల్లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: పీజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో కార్పొరేటర్ రోజాదేవి రంగారావు ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొని మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అందివచ్చిన అవకాశాలను పునికి పుచ్చుకోవాలన్నారు. ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు ఆంజనేయులు, మోజెస్, చంద్రమోహన్ సాగర్, విద్యాసాగర్, రాము, రాధాబాయి, విజయ, భారతమ్మ, స్వరూప, కమలమ్మ, లక్ష్మి, నరసమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే అభివృద్ధి పనుల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30కు 3వ ఫేజులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల పనుల పరిశీలన, 8.45కు 3వ ఫేజులోని అయ్యంగార్ బేకరీ ఎదురుగా ఉన్న షటిల్ కోర్టు పరిశీలన, పార్కుల పరిశీలన, 9 గంటలకు 6వ ఫేజులో పరివార్ మండి రెస్టారెంట్ ప్రారంభం, 9.15 గంటలకు 7వ ఫేజులో థీమ్ పార్కు పరిశీలన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు, మహిళా నాయకులు పాల్గొనాలని కోరారు.

శోభకృత్ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ


పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీచక్ర పీఠాధిపతి యలమంచి శ్రీధర్‌శర్మ

భాగ్యనగర్‌కాలనీ: కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన శోభకృత్ నామ సంవత్సర ఉగాది పంచాంగాన్ని శ్రీ చక్ర పీఠాధిపతి యలమంచి శ్రీధర్ శర్మ చేతుల మీదుగా శుక్రవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్డులోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన సంవత్సరం సకల జనులకు శుభాలను కలిగించాలని... ప్రజారోగ్యం మరింత వృద్ధి చెందాలని.. అందుకు అనుకూలమైన గ్రహచారాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎస్ చైర్మన్ చకిలం సుధాకర్, వెస్ట్ జోన్ సలహాదారు మంత్రిప్రగడ సత్యనారాయణ, కామాక్షి బ్రాహ్మణ సంఘం శంకర్, నర్సింహారావు, మియాపూర్ గాయత్రి బ్రాహ్మణ సంఘం ప్రతినిధి పీఆర్‌కే మూర్తి పాల్గొన్నారు.

మహంకాళినగర్‌లోని సమస్యను పరిష్కరిస్తా


డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: శంషీగూడ పరిధిలోని మహంకాళినగర్ రోడ్లు, డ్రైనేజీ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గా భవాని దేవాలయం ఎదురుగా ఉన్న రెండు వీధుల్లో డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని తెలిపారు. వెంటనే సీసీ రోడ్డు కోసం నిధులు మంజూరు చేయించి సీసీరోడ్డు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచించారు. అదే విధంగా దేవాలయం వెనుక వీధిలోని పాత డ్రైనేజీ లైన్ చిన్నగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. డ్రైనేజీ లైన్ పెద్దగా నిర్మించి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నిరంజన్ యాదవ్, దాతి రమేష్, షేక్ లలన్, సంగారెడ్డి, గురునాథ్, హీరాలాల్, సత్యం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీత కళాకారులను కాపాడుకుంటాం

- కళాకారులకు 'లైఫ్ టైమ్ ప్రివిలేజ్ కార్డు'అందజేశాం
- 50శాతం రాయితీపై కళాకారులందరికీ వైద్య సేవలు
- రెండు రోజులు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ సేవలు అందించాం
- అమోర్ ఆస్పత్రి సీఎండీ డా.కిశోర్ బి.రెడ్డి


లైఫ్ టైమ్ ప్రివిలేజ్ కార్డును ఆవిష్కరిస్తున్న సంగీత దర్శకులు కోటి, ఆర్పీ పట్నాయక్, డా. కిశోర్ బి.రెడ్డి

కూకట్‌పల్లి: తెలుగు సినీ సంగీత రంగానికి అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు వస్తోందని... ఇలాంటి తరుణంలో ఈ రంగానికి చెందిన కళాకారులను గుర్తించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు అమోర్ ఆస్పత్రి యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమని ప్రముఖ సంగీత దర్శకుడు కోటి అన్నారు.

సంగీత కళాకారులకు ఉచిత కన్సల్టేషన్

నగరంలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఒకటైన అమోర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో తెలుగు సినీ సంగీత కళాకారుల యూనియన్ సభ్యులు 580 మందికి గురు, శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం సంగీత దర్శకులు కోటి, ఆర్పీ పట్నాయక్‌ల చేతుల మీదుగా యూనియన్ సభ్యులందరికీ ×లైఫ్ టైమ్ ప్రివిలేజ్ కార్డు×లను అందజేశారు. ఈ కార్డు ద్వారా ఆస్పత్రిలో ఉచిత కన్సల్టేషన్ ఉంటుందన్నారు. ఇన్‌పేషెంట్లుగా చేరాల్సి వస్తే అన్ని రకాల వైద్య సేవల మీద జీవితాంతం 50శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.

- ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ... అమోర్ ఆస్పత్రిలో ఒక మెడికల్ ప్లానెట్‌కు వచ్చినట్లు అనిపిస్తోందన్నారు. అత్యాధునిక సదుపాయాలు, టెక్నాలజీతో ఉన్న ఆసుప్రతికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ... అమోర్ ఆస్పత్రి సేవలను రాయితీ ధరలతో సినీ సంగీత కళాకారులకు అందిస్తున్నందుకు డా. కిశోర్ బి.రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రి సేవలను కళాకారులు వినియోగించుకోవాలని కోరారు.

సంగీత కళాకారులను కాపాడుకుంటాం

ఆస్పత్రి సీఎండీ, ప్రముఖ ఆర్థో అంకాలజీ సర్జన్ డా. కిశోర్ బి.రెడ్డి మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సంస్కృతి, కళలను కాపాడుతున్న వారు సినీ కళాకారులే అని అన్నారు. అలాంటి వారిని కాపాడుకోవటం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఆరోగ్యాన్ని ఏ మాత్రం లెక్క చేయకుండా కళామతల్లి సేవలోనే జీవితం గడుపుతున్న కళాకారుల కోసం అమోర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రెండు రోజులు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ సేవలు అందించామని తెలిపారు. భవిష్యత్‌లో వారికి ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా కాపాడేందుకు వీలుగా లైఫ్ టైమ్ ప్రివిలేజ్ కార్డులు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సినీ కళాకారులు యూనియన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి కె.రమాచారి, ఉపాధ్యక్షుడు జైపాల్ రాజ్, కోశాధికారి రమణ, సంయుక్త కర్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.